REGD. No. H 18 విడిప్రతి 0-25 పై. 12-5-67 శుక్రవారం

నెల్లూరు దేనికి ప్రసిద్ధి?
"మంజు" హోటల్‌కు!
హోటల్ మంజు దేనికి ప్రసిద్ధి?
మధురమైన మాంసాహారానికి!
"నెల్లూర్లో మొదటి హోటల్"
'మంజు-అప్సర'
ఆంధ్రాబ్యాంకివీధి
ఫోన్ :: 522.

# జమీన్‌రైతు

స్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు
సంపుటి 39 ★ సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి ★ సంచిక 19

మద్రాసులో
ఎక్కడ దిగుతారు?
విజయలాడ్జిలో
దిగండి.
★★★
ప్రొప్రయిటరు
మీ మిత్రుడు
కె. లక్ష్మీనారాయణ.

# రాష్ట్రపతి ఎన్నిక-
## రాజకీయేతర కారణాలతోనే కాంగ్రెస్ ఓట్లు జారిపొయ్యాయా? పి. డి. పార్టీలో చీలికలా?

(మా హైదరాబాదు విలేఖరి)

రాష్ట్రపతి పదవికి మొట్టమొదటిసారిగా పోటీ జరగడం, అభ్యర్థులు యిరువురి మధ్యన తీవ్రమైన పోటీజరగడం, కాంగ్రెస్ అభ్యర్థియైన డాక్టర్ జాకిర్ హుసేన్ విజయం పొందడం జరిగిపోయింది.

డాక్టరు హుసేన్ రాష్ట్రపతి పదవి నలంకరించడానికి అన్నివిధాల అర్హుడన డంలో సందేహంలేదు. తన జాతీయవాద విశ్వాసం కారణంగా అలీఘర్ విశ్వవిద్యాలయంలో తన అధ్యాపక వుద్యోగాన్ని విరమించి జాతీయ విద్యాలయాన్ని స్థాపించిన ధీరుడాయన. ఈ విద్యాలయమే తరువాత "జామె మిలియా" విశ్వవిద్యాలయంగా ఢిల్లీలో వర్థిల్లుతున్నది.

బేసిక్ విద్యావిధానం రూపొందించడంలో గాంధీజీ అండన నిలచిన మేధావుల్లో ప్రముఖుడాయన.

పది పదిహేను సంవత్సరాలుగా పార్టీ రాజకీయాలకుదూరంగావుంటూ రాజభవన నివాసం చేస్తున్న వరహాగిరి వెంకటగిరి మళ్ళీ భారత ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ సభాపతిగా కార్యశీలురవుతున్నారు. అంధ్రులైన డాక్టరు రాధాకృష్ణన్ రాష్ట్రపతిపదవి నలంకరించారు. కనుక ఉపరాష్ట్రపతి పదవికి గిరిగారి ఎన్నిక ఆ విధంగా గర్వకారణం కాకపోవచ్చును. కాని గిరిగారి ఎంపిక, ఎన్నిక, రెండూ కూడా నిస్వార్థ ప్రజాసేవకునికి జరిగిన అపూర్వ సన్మానంగా అందరూ గర్వించదగినది.

ముఖ్యమంత్రి పదవికి కీచులాటలు, కుట్రలు, అధికార దుర్వినియోగం, పార్టీ క్రమశిక్షణాతిక్రమణలు పరిపాటై పోయాయి యీ రోజుల్లో. ఇందుకోసం నమ్ముకున్న నాయకులను అనుచర సహచరులను విద్రోహం చేయడం కూడా చూస్తున్నాం. కాని యీ విషయంలో గిరిగారి ప్రవర్తన రాజకీయవేత్తలందరికీ ఆదర్శప్రాయమైనది; ఆనాటినుంచి యీనాటి వరకు మళ్లీ మరెవరూ ఆయనలా త్యాగబుద్ధిం ప్రదర్శించలేదుకనుక అపూర్వమైనదికూడా.




ఉపరాష్ట్రపతి శ్రీ వి. వి. గిరి

1946 లో సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తరువాత గాంధీజీని రాజాజీని కాదని ప్రకాశంపంతులుగారు వుమ్మడి మద్రాసు ముఖ్యమంత్రిపదవి నలంకరించినది లగాయతు ఆయన్ను గద్దెదించాలని అరవలు పెద్దపెట్టున ప్రయత్నం ప్రారంభించారు. చివరికి 11 మాసాల్లో పదవీ వాంఛాపరులైన కొందరాంధ్ర శాసనసభ్యుల సహాయంతో కృతకృత్యులయ్యారు కూడా. ఆ సందర్భంలోను, అంతకుముందుకూడా గిరిగారిని పార్టీ నాయకుడుగా ఏకగ్రీవంగా ఎన్నుకుంటామని నమ్మతించమని అభ్యర్థించారు. ఆయన పూః అంటే ముఖ్యమంత్రి పదవి అనాడేఆయనకులభించివుండేదికాని ఆంధ్ర ప్రజానాయకుడు, తమ రాజకీయ గురువు అయిన ప్రకాశంపంతులుగారు వుండగా మరొకరావడానికి తగరని గిరిగారు ప్రకటించి తప్పుకున్నారు. స్వతంత్ర భారతంలో సార్వత్రిక ఎన్నికలు ప్రథమంగా జరిగినప్పుడు పార్లమెంటుకు గిరిగారు ఎన్నికయారు. కేంద్రంలో కార్మిక మంత్రిగా చేరారు. కాని డాక్టరు దేశముఖ్‌తో బ్యాంకుపనివారి ఎవార్డు విషయంలో అభిప్రాయభేదం వచ్చినప్పుడు, తమ మంత్రిపదవికి రాజీనామాఇచ్చారు. కొన్నాళ్లతర్వాత ముందు లక్నోలో, తర్వాత తిరువాంకూరు, బెంగుళూరులో గవర్నరుగా రాజభవనవాసం చేశారు. భారతకార్మిక వుద్యమ నిర్మాతల్లో శ్రీ గిరి ఒకరు. రైల్వే వుద్యోగులను సంఘటితం చేయడంలో, వారి సమ్మెలను నిర్వహించడంలో గిరి చూపిన ప్రతిభ, ధైర్యసాహసాలు అసమానమైనవి.

*

రాష్ట్రపతి పదవికి జరిగిన పోటీప్రచారమైనం దిగజారుతున్న మన విలువలకు ప్రతిబింబంగావుందంటే అతిశయోక్తి కాదు. డాక్టర్ జాకిర్‌హుసేన్ విజయం పొందినప్పటికీ, ఇందులో కాంగ్రెస్‌వారు గర్వించదగినదేమీ కనిపించదు. కాంగ్రెస్‌కు మిగిలిన కొద్ది పెట్టనికోటల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. అయినా ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌పార్టీసంఖ్య (165) కంటే డాక్టర్ జాకిర్‌హుసేన్‌కి బాగా తక్కువఓట్లురావడం గమనార్హం. కాంగ్రేసేతరులు చలువు

—కొరవ 7 వ పేజీలో



రాష్ట్రపతి డాక్టర్ జకిర్ హుసేన్

# పంచాయతీరాజ్యం-
## మార్పులు-మంత్రులు

(మా హైదరాబాదు విలేఖరి)

పంచాయతీరాజ్య వ్యవస్థపై, ఎం. టి. రాజా సంఘం సిఫార్సులను ఆమోదించి బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వం ప్రారంభించిన దానికి వ్యతిరేకంగా జిల్లాపరిషత్తు అధ్యక్షులందరూ, వారేముఠాకి చెందినప్పటికీ, ఏకమయ్యారు. ఒక కడపజిల్లా పరిషదధ్యక్షుడు నరసింహారెడ్డిగారుతప్ప. ఎం. టి. రాజా సంఘంలోని 13 సభ్యుల్లో నున్న యిద్దరు అనధికారుల్లో నరసింహారెడ్డిగారొకరు. మరొకరు భాస్కరావుగారు.

ప్రభుత్వమూ, ముఖ్యమంత్రి ఎంత కాదన్నప్పటికీ, ఎం. టి. రాజా సంఘ సిఫార్సుల నమలుచేసినప్పుడు పంచాయతీ రాజ్య వ్యవస్థపై అది గొడ్డలిపెట్టే అవుతుంది. ఈ పద్ధతి వ్యవస్థపట్ల ప్రభుత్వంలో నన్నగిల్లుతున్న విశ్వాసమే కనిపిస్తుంది. ఐతే ఇంతటి ప్రధానమైన మార్పులను ఒక రెవెన్యూబోర్డు సభ్యుడు, మరికొందరు కలెక్టరు హోదాగల అధికార్లతోకూడిన సంఘం చేసిన సిఫార్సుల నాధారంగా చేయబూనడం చాలా విచిత్రమైనది. ఆరితేరిన రాజకీయవేత్తలు పరిపాలనానుభవజ్ఞులతోకూడిన పరిపాలనాసంఘం చేసిన సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించికూడా ఇంతవరకు అమలుచేయలేదు. పైగా జిల్లా పరిపాలన విషయంలో ఈ సంఘంచేసిన సిఫార్సులు, ఎం. టి. రాజా సంఘసిఫా రసులకు పూర్తిగా భిన్నంగావున్నాయి. ఆ సిఫార్సులనైనా అమలుచేయాలని నిర్ణయించకపోగా తద్విరుద్ధమైన మార్పులు చేయబూనుతున్నది ప్రభుత్వం.

తమ ప్రభుత్వ యంత్రాంగంపైన యింతటి విశ్వాసం ముఖ్యమంత్రికి, రెవిన్యూ మంత్రికి వుండడం ముదావహం. వీరికి పంచాయతీరాజ్యమంత్రి తోడయ్యారు. పంచాయతీరాజ్యంలో చాలాకాలం అనుభవంకల విజయభాస్కరరెడ్డిగారికికూడా, ప్రభుత్వం తలపెట్టిన మార్పులు అంగీకారయోగ్యంగా వున్నట్టు కనిపించడంలేదు.

— —



కేంద్రమంత్రి శ్రీ రఘునాథరెడ్డిగారు ఇటీవల 'జమీన్‌రైతు' కార్యాలయానికి విచ్చేసినప్పుడు ప్రెస్‌ను తిలకిస్తున్న దృశ్యం.

మా 2వ బీరువాల స్కీములోచేరండి
నెలకు రు. 25 లు - వాయిదాలు 16.
ప్రతి నెల 30 తేది "డ్రా" జరుగును.
స్కీములో చేరుటకు ముగింపుతేది 25-5-67. 'డ్రా' 30-5-67
— మా 1-వ నెంబరు స్కీములో ప్రైజులు పొందినవారు —
(1) గ్రంధి వెంకటేశ్వరులు — బుచ్చి.
(2) సుబ్బిశెట్టి సుబ్రహ్మణ్యం — చినపవని.
(3) గ్రంధి సుబ్రహ్మణ్యం — పురిణి.
(4) జలదంకి మోహనరెడ్డి — ఇందుపూరు.
(5) నల్లూరి రామకృష్ణప్రసాద్ — కావలి.
(6) పబ్బిశెట్టి శ్రీనివాసులు — కావలి.
—: వివరములకు :—
శ్రీ సత్యనారాయణ ఐరన్ & స్టీల్ వర్క్సు
ప్రొప్రయిటరు :: గోనుగుంట బ్రహ్మయ్య.
కావలి - నెల్లూరుజిల్లా.

